క్లుప్తంగా

హమ్మయ్యా.. గోతులు పూడ్చారు



పిఠాపురం-ఉప్పాడ రోడ్డులో గొయ్యిని పూడ్చిన దృశ్యం

సాక్షి ఇంపాక్ట్

కొత్తపల్లి: పిఠాపురం-ఉప్పాడ రోడ్డులో పైపులైను మరమ్మతుల కోసం తవ్వి వదిలేసిన గోతులను అధికారులు ఎట్టకేలకు పూడ్చారు. ఈ గోతులు ప్రమాదకరంగా మారడంతో శనివారం 'సారూ.. ఇదేం పని తీరు !' అనే శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి విద్యుత్ ఉప కేంద్రం, యండపల్లి జంక్షన్ సమీపంలోని గోతులను పూడ్చారు. సమస్య పరిష్కారం కావడంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



రోగులకు కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కొత్తపల్లి: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని సురక్ష మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ వైద్యులు జ్యోతుల శ్రీనివాసరావు సూచించారు. స్థానిక సురక్ష ప్యాలస్‌లో అదివారం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి డాక్టర్లతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు సుమారు 1200 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. 300 మందిని కంటి ఆపరేషన్లు, 250 మందిని కళ్లజోళ్లకు ఎంపిక చేశారు. వీరికి త్వరలో ఆపరేషన్లు చేయిస్తామని శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం రోగులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. శిబిరంలో కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సౌజన్య

కొత్తపల్లి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాగులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సౌజన్య సూచించారు. ఆదివారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున కండ్ల కలక వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. సగటున రోజుకు 20 నుంచి 30 వరకు కేసులు వస్తున్నాయని ఆమె తెలిపారు. కండ్ల కలక అంటు వ్యాధి కాదన్నారు. కండ్ల కలక వచ్చినపుడు ఎట్టి పరిస్థితిల్లోనూ కంటిని నలపరాదన్నారు. గోరువెచ్చని నీటితో కళ్లను శుభ్రం చేసుకోవాలని సూచించారు. కంటి వైద్య నిపుణులను సంప్రదించి తగిన మందులు వేసుకోవాలన్నారు. కండ్ల కలక వచ్చిన వ్యక్తికి డ్రాప్స్ వేసిన తర్వాత చేతులను శుభ్రపరచుకోవాలని, లేదంటే అది మరోకరికి వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

మహిషాసుర మర్దినికి అభిషేకాలు



సామర్లకోట: పంచారామ క్షేత్రంలో ఉన్న మహిషాసురమర్దిని ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసం దుర్గాష్టమి సందర్భంగా ఉదయం అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేశారు. పూజల అనంతరం అమ్మ వారిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనేక గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చారు. వీరికి ప్రసాద వితరణ చేశారు.

స్విమ్మింగ్ పోటీల్లో పల్లవి ప్రతిభ



రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన పల్లవి

పెద్దాపురం: కర్నూలు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సిమ్మింగ్ పోటీల్లో పెద్దాపురం మండలం రాయభూపాలపట్నం గ్రామానికి చెందిన మన్యం పల్లవి విశేష ప్రతిభ కనబరిచింది. సబ్ జూనియర్ విభాగంలో 50 మీటర్లు, 100 మీటర్లు, బటర్‌ఫ్లై స్ట్రోక్ ఈవెంట్‌లో తృతీయ స్థానం సాధించింది. రాష్ట్ర స్థాయిలో రెండు తృతీయ స్థానాలు సాధించిన పల్లవిని పలువురు అభినందించారు.

కొత్తగా వచ్చి.. చెత్తగా మారి..

ప్రజల కష్టార్జితంలో కొంత సొమ్ము పన్నుల రూపేణా ప్రభుత్వ ఖజానాకు చేరుతుంది. దాంతో ప్రజోపయోగ కార్యక్రమాలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగానిది. ఈ మేరకు ప్రజా సొమ్ముతో కొనుగోలు చేసిన వాహనాలు.. కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మూలనపడ్డాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన ప్రభుత్వ వాహనాలు వినియోగానికి నోచుకోకుండా.. అక్కరకు రాని ఇనుప ముక్కలుగా మారుతున్నాయి.

- మున్సిపాలిటీలకు సెప్టీ క్లీన్ ట్యాంకర్లు
- ఐదు నెలల నుంచి నిరుపయోగంగానే..
- గతంలో మినీ ట్రాక్టరుదీ ఇదే దుస్థితి
- స్వచ్ఛాంధ్ర లక్ష్యం నెరవేరేనా..!



సామర్లకోట మెప్మా కార్యాలయ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న పారిశుధ్య మినీ వాహనాలు



సామర్లకోట మున్సిపల్ కార్యాలయంలో ఉన్న సెప్టీక్లీన్ ట్యాంకరు

సామర్లకోట: మున్సిపాలిటీలకు చేరిన సెప్టీక్లీన్ ట్యాంకర్లు నిరుపయోగంగా పడి ఉండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా సుమారు ఐదు నెలల క్రితం నియోజకవర్గ పరిధిలోని సామర్లకోట, పెద్దాపురం మున్సిపాలిటీలకు సెప్టీక్లీన్ ట్యాంకులు వచ్చాయి. మున్సిపాలిటీలకు ఈ ట్యాంకులు వచ్చిన తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో, వాటిని ప్రారంభించకపోవడంతో వినియోగంలోకి రాలేదు. దాంతో స్వచ్ఛాంధ్ర లక్ష్యం కుంటుపడుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రతి మున్సిపాలిటీలో ఉన్న బహిరంగ మరుగుదొడ్ల స్థానంలో సామూహిక మరుగుదొడ్లను నిర్మించారు. దీనికితోడు ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోను మరుగుదొడ్లు ఉన్నాయి. గత ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ రావడంతో, ప్రతి సచివాలయంలోను మరుగుదొడ్లను నిర్మించారు. ఇటువంటి తరుణంలో ఆయా మరుగుదొడ్లకు చెందిన సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేసేలా ఈ సెప్టీక్లీన్ ట్యాంకర్లను సమకూర్చారు. దీనికి సంబంధించి నియమనిబంధనలు అందలేదనే సాకుతో వాటిని ప్రారంభించకుండానే నిరుపయోగంగా వదలివేశారు.

వాహనాలపై ఏదీ శ్రద్ధ !

మున్సిపాలిటీలకు మంజూరవుతున్న వాహనాలపై అధికారులకు కనీస శ్రద్ధ ఉండడం లేదనే విమర్శలు ఉన్నాయి. మున్సిపాలిటీ ప్రారంభం నుంచి ఇదే పరిస్థితి తలెత్తుతుందని అంటున్నారు. కలెక్టరుగా సతీష్‌చంద్ర ఉన్న సమయంలో మున్సిపాలిటీకి వచ్చిన మినీ ట్రాక్టరును ఉపయోగించకుండానే ఇనుప ముక్కగా విక్రయించిన సంఘటనను ప్రజలు ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటున్నారు. గత ప్రభుత్వంలో వచ్చిన తొమ్మిది మినీ పారిశుధ్య వాహనాల్లో ఆరు వరకు అధికారులు నిరుపయోగంగా వదలేశారనే విమర్శలూ ఉన్నాయి. వీటికి స్వల్ప మరమ్మతులు రావడంతో.. వినియోగించకుండానే వదలివేశారు. దాంతో అవి కూడా ఇనుప ముక్కలుగా మారే అవకాశం లేకపోలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టరు నిర్లక్ష్యం కారణంగానే వీటిపై శ్రద్ధ కరువైందని అంటున్నారు.

వీటి బాధ్యత అధికారులదే..



ప్రజల సొమ్ముతో ప్రభుత్వ కార్యాలయాలకు వాహనాలు సమకూరుస్తారు. వీటిని పరిరక్షించాల్సిన బాధ్యత మాత్రం అధికారులపై ఉంది. గతంలో అనేక పారిశుధ్య వాహనాలు కాస్తా పనికిరాని ఇనుప ముక్కలుగా మారిపోయాయి. మున్సిపాలిటీకి వచ్చిన మినీ పారిశుధ్య వాహనాలనూ మరమ్మతుల పేరుతో నిరుపయోగంగా వదిలేశారు. ప్రతి వాహనానికి గ్యారంటీ సమయం ఉంటుంది. ఆ మేరకు మరమ్మతులు పూర్తి చేయించాలి. సుమారు తొమ్మిదేళ్ల క్రితం మున్సిపాలిటీకి వచ్చిన రోడ్ల శుభ్రత మెషీన్ ఇప్పటికీ నిరుపయోగంగా పడి ఉంది. అదే పరిస్థితి సెప్టీక్లీన్ ట్యాంకరుకు పట్టరాదని పట్టణవాసులు కోరుకుంటున్నారు.

– కరణం రాజ్‌కుమార్, కౌన్సిలర్, సామర్లకోట

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ప్రారంభిస్తాం



మున్సిపాలిటీకి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి సెప్టీక్లీన్ ట్యాంకరు వాహనం వచ్చింది. తర్వాత ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో దానిని ప్రారంభించడానికి అవకాశం లభించలేదు. వాహనం వినియోగానికి సంబంధించి గైడ్‌లైన్స్ రావాల్సి ఉంది. ప్రస్తుతం ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వెళ్లి, ఈ వాహనం వినియోగంలోకి తీసుకువస్తాం. మినీ శానిటేషన్ వాహనాలు సరఫరా చేసిన కంపెనీకి వాటి మరమ్మతుల కోసం సమాచారం ఇచ్చాం.

– జాస్తి రామారావు, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

శాకంబరిగా ముత్యాలమ్మ అమ్మవారు



శాకంబరి అలంకరణలో ముత్యాలమ్మ అమ్మవారు

సామర్లకోట: కాకినాడ రోడ్డులో ఉన్న ముత్యాలమ్మ అమ్మవారు ఆదివారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం కావడంతో అమ్మవార్లను శాకంబరి అలంకరణ చేయడం పరిపాటి. ఇందులో భాగంగా పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి దేవస్థానం దీపారాధన సంఘ సభ్యులు కూరగాయలు, పండ్లతో ముత్యాలమ్మ అమ్మవారిని అలంకరించి, పూజలు చేశారు. ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అనేక వాహనాల్లో రావడంతో కాకినాడ రోడ్డు తిరునాళ్లను తలపించింది. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

గ్రీన్ సిటీగా మారుస్తాం

బోట్‌క్లబ్: కాకినాడ స్మార్ట్‌సిటీని గ్రీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని వన్ స్టెప్ టూ వర్డ్స్ సొసైటీ అధ్యక్షుడు జోగా రామకృష్ణ తెలిపారు. తమ సొసైటీ ద్వారా ఇప్పడి వరకు 18 వేలకు పైగా మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తున్నట్లు వివరించారు. కాకినాడ్ గరల్స్ పాలిటెక్నిక్‌లో సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా జీపీటీ హాస్టల్‌లో పేరుకుపోయిన ముళ్ల పొదళ్లను తొలగించి, మొక్కలు నాటారు.

మరిడమ్మ ఆలయానికి భక్తుల పోటు



మరిడమ్మ అమ్మవారు



అమ్మవారి దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

పెద్దాపురం: ఏటా ఆషాఢ మాసంలో నిర్వహించే మరిడమ్మ జాతర మహోత్సవాల్లో రెండో ఆదివారం మరిడమ్మను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు భారీగా క్యూ కట్టారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు చర్యలు చేపట్టారు. ఆలయ జాతర మహోత్సవ తాత్కాలిక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. డీఎస్పీ లతాకుమారి ఆదేశాల మేరకు సీఐ రవికుమార్ పర్యవేక్షణలో ఎస్సై వెలుగుల సురేష్ భారీ బందోబస్తు నిర్వహించారు. సుమారు 50 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు అధికారుల అంచనా. స్థానిక స్వచ్ఛంద సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు ఆదివారం పులిహోర అందజేశారు. పెద్దాపురం బ్రాహ్మణ సేవా సంఘం, సామర్లకోట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో యాత్రికులకు ఉచితంగా పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

తీరంలో పర్యాటకుల సందడి



ఉప్పాడ తీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ సాగరతీరం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. కొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు ఉప్పాడ బీచ్‌కు వచ్చి సందడి చేశారు. ఉదయం తుని సమీపంలోని లోవ తలుపులమ్మతల్లి అమ్మవారిని దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నానికి తిరిగి సాగరతీరానికి చేరుకున్నారు. కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. పర్యాటకుల ఆటపాటలతో సాగర తీరం క్రీడా మైదానంగా మారిపోయింది. అధిక సంఖ్యలో వాహనాలు రావడం వల్ల కాకినాడ-ఉప్పాడ బీచ్‌లో రోడ్డు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

జోరు వాన



వాకతిప్ప డ్రైన్ పూడుకుపోయి రోడ్డుపై నిలిచిన నీరు

కొత్తపల్లి: మండలవ్యాప్తంగా ఆదివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాకతిప్ప గ్రామ సచివాలయం ఎదురుగా ఉన్న వీధిలో డ్రైన్ పూడుకుపోవడంతో నీరు రోడ్లుపై నిలిచిపోతుంది. స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం వచ్చిన ప్రతిసారి ఇదే పరిస్థితి తలెత్తుతోందని, దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు నియోజకవర్గ స్థాయి గ్రీవెన్స్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: పెద్దాపురం ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో సోమవారం నియోజకవర్గ స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) గ్రీవెన్స్‌ను జరుగుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని పెద్దాపురం ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు గ్రీవెన్స్ ఉంటుందన్నారు. కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా స్థాయి, డివిజన్ స్థాయి అధికారులు హాజరవుతారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం దిశగా చేపట్టే గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్‌ఏసీ శిక్షణలో పాల్గొన్న డీపీఓ

కాకినాడ సిటీ: స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ (ఎస్ఏసీ) ఆధ్వర్యంలో విజయవాడలో రెండు రోజుల పాటు సాలిడ్ లిక్విడ్ రీసోర్స్ మేనేజ్‌మెంట్ (ఎస్ఎల్ఆర్ఎం)పై జరిగిన శిక్షణ కార్యక్రమానికి కాకినాడ జిల్లా నుంచి డీపీఓ భారతి సౌజన్య హాజరయ్యారు. సమ్మిళిత, సుస్థిర ఘన, ద్రవ వనరుల నిర్వహణ, రీసోర్స్ మేనేజ్‌మెంట్ టెక్నిక్‌లు, నీటి వనరుల నిర్వహణలో దేశీ బాతుల పాత్ర, దోమలు, ఎలుకల రహిత స్థానిక సంస్థలు వంటి అంశాలపై రీసోర్స్‌పర్సన్ సి.శ్రీనివాసన్ వివరించినట్టు భారతి సౌజన్య తెలిపారు.



ఇగోకవరంలో సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టులో నీరు



ధర్మవరంలో అడుగంటిన రామభద్రరాజు చెరువు

కళ తప్పిన జలాశయాలు

- సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల్లో కానరాని నీటి నిల్వలు
- ముమ్మరంగా ఖరీఫ్ సాగు
- వ్యవసాయ పనుల్లో అన్నదాతలు బిజీ
- మండలంలో 10,500 ఎకరాల్లో సాగు

ప్రత్తిపాడు రూరల్: తొలకరి ప్రారంభమై నెల రోజులు దాటినా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. ఫలితంగా నియోజకవర్గంలోని సాగునీటి జలాశయాలు వెలవెలబోతున్నాయి. చెరువులు, జలాశయాల్లో నీరు చేరకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టులైన సుబ్బారెడ్డి సాగర్ ద్వారా పది వేల ఎకరాలు, కట్టుచింతల ప్రాజెక్టు ద్వారా ఐదు వేల ఎకరాలకు, పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా మరో పది వేల ఎకరాలకు సాగు నీరు అందుతోంది. ఈ ఏడాది వేసవిలో భారీగా నమోదైన ఉష్ణోగ్రతలకు ప్రాజెక్టులు మునుపెన్నడూ లేని విధంగా అడుగంటిపోయాయి. **జూన్ మాసం నుంచి ఇప్పటి వరకూ చెప్పుకోదగ్గ వర్షాలు కురవకపోవడంతో ప్రాజెక్టులు ఇప్పటికీ వెలవెలబోతున్నాయి. ఏటా జూన్ నెలాఖరు నాటికే భారీగా కురిసే వర్షాలకు ప్రాజెక్టులు నిండుకుండల్లా మారేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఇక పంట** చెరువుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. దీంతో రైతుల్లో రోజురోజుకూ ఆందోళన రెట్టింపు అవుతోంది. ప్రస్తుత సీజన్‌లో వర్షాలు కురిసి ప్రాజెక్టుల్లోకి నీరు చేరకపోతే ఖరీఫ్ గట్టెక్కడం కష్టమేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా అంతంత మాత్రంగానే సాగునీరు అందుతోంది. దీంతో రైతులు ఆశగా వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు.

అడుగంటిన చెరువులు

మండలవ్యాప్తంగా భారీ సంఖ్యలో చిన్న, పెద్ద తరహా చెరువులు ఉన్నాయి. ఈ ఏడాది వేసవిలో నమోదైన భారీ ఉష్ణోగ్రతలకు చెరువులు ఎండిపోయాయి. **ప్రస్తుతం సమృద్ధిగా వర్షాలు కురవకపోవడంతో చెరువులు వెలవెలబోతున్నాయి. మండలంలోని ధర్మవరంలో రామభద్రరాజు, తమ్మయ్య, కలువల, రేగుల, వెంటివారి చెరువులు, చింతలూరులో నామానుజం, పెద్ద చెరువులు, ఒమ్మంగిలో రాజ్, గోపాలుడు చెరువులు, ఉత్తరకంచిలో మల్లుదొర** చెరువు, పెదశంకర్లపూడిలో వెంకన్నదొర చెరువు, చిన శంకర్లపూడి కుదుముల, కొత్త చెరువులు, ఏలూరు వెంకటపతిరాజు చెరువు, ప్రత్తిపాడులో పుత్ర, ఊర, సిద్దావారి, దేవుళ్లపల్లె వారి చెరువులు, పోతులూరులో పెద్ద చెరువు, శరభవరం పెద్ద చెరువు, పొదురుపాకలో దార చెరువు, రాచపల్లిలో అంకమ్మ, గుల్లింకవారి, పేర్రాజు, రంగరాజు, తిమ్మరాజు వెరసి మొత్తం 52 చెరువులు ఉన్నాయి. వీటి ద్వారా ఐదు వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోంది. కాగా ప్రస్తుతం ఈ చెరువులన్నీ నీరులేక వెలవెలబోతున్నాయి. రైతులు దేవుని మీద భారం వేసి ఖరీఫ్ సాగు చేపట్టారు.

అరకొరగా వర్షాలు

ఈ ఏడాది తొలకరి ప్రారంభంలో అరకొరగా వర్షాలు కురిశాయి. భవిషత్‌లో వర్షాలు కురిసి పొలాలకు పూర్తిస్థాయిలో నీరు అందుతుందనే ఆశతో రైతులు సాగుకు సన్నద్ధమయ్యారు. జూన్ ముగిసి జులైలో పక్షం రోజులు పూర్తయినా వర్షాల జాడ కనిపించడం లేదు. అడపాదడపా ఆకాశం మేఘావృతమై తుంపర జల్లులు పడడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. కాగా పలు గ్రామాల్లో రైతులు ఇప్పటికే వరి నారుమళ్లు వేశారు. మరికొన్ని చోట్ల వెదజల్లు విధానంగా సాగు చేసేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. ప్రత్తి, సరుగుడు, కూరగాయలు, ఇతర పంటలు సాగు చేసే రైతులు సైతం వర్షాల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. కాగా వ్యవసాయ బోర్ల పరిధిలో వేసిన వరి నారుమళ్లు ఏపుగా ఎదుగుతున్నాయి.



కిత్తమూరిపేటలోని కట్టుచింతల ప్రాజెక్టులో అడుగంటిన జలాలు

అంతంత మాత్రంగా వర్షపాతం

ఈ సీజన్‌లో మండలంలో జూన్ 22న అత్యధికంగా 3.6 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభించాలంటే 83 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాలి. కాగా జూన్ నెల నుంచి ఇప్పటి వరకూ 65.6 మిల్లీ మీటర్ల మేర వర్ష పాతం నమోదైందని అధికారులు తెలిపారు. వర్షాలు కురువకపోవడంతో రైతులు నారుమడులను పూర్తి స్థాయిలో సిద్ధం చేసుకోలేకపోయారు.

15,577 ఎకరాల్లో సాగు

ప్రత్తిపాడు మండలంలో 15,577 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. దీనిలో 10,500 ఎకరాల్లో వరి, 1500 ఎకరాల్లో పత్తి, 925 ఎకరాల్లో మినుము, 105 ఎకరాల్లో పెసలు, 2,547 ఎకరాల్లో ఇతర పంటలను సాగు చేసే అవకాశం ఉన్నటుల్ వ్యవసాయాధికారులు తెలిపారు.

వర్షాలు కురవకుంటే సాగు కష్టమే



వేసవిలో భారీ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రాజెక్టులు పూర్తిగా అడుగంటాయి. తొలకరి ప్రారంభమై నెల రోజులకు పైగా అవుతోంది. ఇప్పటివరకూ చెప్పుకోదగ్గ వర్షం కురవలేదు. వర్షాలు కురువకపోవడంతో ప్రాజెక్టుల్లోకి నీరు వచ్చి చేరలేదు. గతంలో వర్షాలు పుష్కలంగా కురిసేవి. జూలైలో మొదటి వారంలోనే ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరేది. ప్రాజెక్టులకు నిండుకుండలు తలపించేవి. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడంలేదు. వర్షాలు పుష్కలంగా కురిస్తేనే సాగుకు పూర్తి స్థాయిలో నీరు అందుతుంది.

– గొర్ల బాబ్జి, రైతు, పెద్దిపాలెం, ప్రత్తిపాడు మండలం

ఈ ఏడాది ఆలస్యం



వర్షాలు ఈ ఏడాది ఆలస్యం కావడంతో ప్రాజెక్టుల్లోకి చెప్పుకోదగ్గ స్థాయిలో నీరు రాలేదు. మండలంలోని సుబ్బారెడ్డి సాగర్, కట్టుచింతల ప్రాజెక్టులు, పంట చెరువుల్లోకి వర్షాధారంగానే నీరు వచ్చి చేరుతుంది. వర్షాలు లేకపోవడంతో ప్రాజెక్టులు, పంట చెరువులకు నీటి ఎద్దడి నెలకొంది. 87 మీటర్ల సామర్థ్యం కలిగిన సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం 81.80 మీటర్లు మాత్రమే నీరు ఉంది.

– ఇబ్రహీం, ఏఈఈ, ఇరిగేషన్, ప్రత్తిపాడు